TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 182 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ మంగళవారం.27.01.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## తెలంగాణ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ సమగ్ర, సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఎగరవేసిన ఆయన భద్రతాదళాల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం... ప్రియమైన తెలంగాణ ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్ రెండేండ్లలో సాధించిన ప్రగతిని వివరించారు. 'తెలంగాణ రైజింగ్ విజన్–2047' డాక్యుమెంట్ ద్వారా అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందేలా లక్ష్యాలను నిర్దేశించామని తెలిపారు. కోర్, ప్యూర్, రేర్ పేర్లతో రాష్ట్రాన్ని మూడు ఎకనమిక్ జోన్లుగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ (బాపూఘాట్), మెట్రో రెండో దశ, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.

పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ జోన్ ద్వారా ఔటర్ రింగ్‌రోడ్, రీజినల్ రింగ్‌రోడ్ మధ్య గల ప్రాంతాన్ని తయారీ రంగం కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రూరల్ అగ్రికల్చర్ రీజినల్ ఎకానమీ జోన్ ద్వారా ట్రిపుల్ ఆర్‌కు బయట వ్యవసాయం, హరిత ఆర్థికవ్యవస్థ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. మేడారం అభివృద్ధికి రూ. 251 కోట్లు కేటాయించినట్టు గవర్నర్ వెల్లడించారు. రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామనీ, 26 లక్షల మంది రైతులకు రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. సన్నవడ్లకు బోనస్‌గా రూ. 1,780కోట్లు అందజేశామని తెలిపారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. గతేడాది బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాయని పేర్కొన్నారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం తీసుకొచ్చామన్నారు.

62 వేల ఉద్యోగాలు..

గ్రూప్–1, 2, 3 ద్వారా రెండేండ్లలో 62,749 ఉద్యోగాలు భర్తీ చేశామని గవర్నర్ తెలిపారు. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్లుగా మార్చి, తెలంగాణను గ్లోబల్ స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రయివేట్ విద్యా సంస్థలతో సమానంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థుల మెస్ చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేందుకుగాను 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందన్నారు. అలాగే పోలీస్ సిబ్బంది పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రారంభించామని గవర్నర్ తెలిపారు.

మహిళా సాధికారతే....

మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని గవర్నర్ అన్నారు. వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని తెలిపారు. రెండేండ్లలో బ్యాంకుల ద్వారా మహిళలకు రూ. 40 వేల కోట్లు సమకూర్చామన్నారు. మహిళలను పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులకు ఓనర్లుగా చేశామని చెప్పారు.



ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటికే 200 కోట్ల మంది ఉచిత ప్రయాణాలు చేశారని వెల్లడించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం 27 ఎకరాల్లో రూ. 2వేల కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టిందని తెలిపారు.

4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లు...

ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. చెంచులకు ప్రత్యేకంగా 10 వేల ఇండ్లను కేటాయించామని తెలిపారు. నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామని వివరించారు. చేనేత కార్మికులకు రూ. 5లక్షల బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. "తెల్ల రేషన్ కార్డుల ద్వారా 1.03 కోట్ల కుటుంబాలకు చెందిన 3.34 కోట్ల మందికి లబ్ధి చేకూరుతోంది. ప్రతి నెలా 2.10 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. పాఠశాలలు, హాస్టళ్లకు 6,500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందిస్తున్నాం. 35,700 అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సన్నబియ్యం అందిస్తున్నాం" అని గవర్నర్ వివరించారు.

ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థే లక్ష్యం...

"కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే క్రమంలో తెలంగాణ సైతం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. ఈ లక్ష్యసాధనకు తెలంగాణ రైజింగ్–2047 దార్శనిక పత్రాన్ని రూపొందించింది" అని గవర్నర్ వివరించారు. సంక్షేమం, వ్యవసాయం, మౌలిక వసతులు, డిజిటల్ విద్య, ఐటీ రంగంలో రాష్ట్రం విశేష పురోగతి సాధించిందన్నారు. "మన దేశం, మన తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలి. రాజ్యాంగ విలువలను పరిరక్షించాలి. ప్రజలు శాంతి, గౌరవం, సౌభాగ్యంతో జీవించాలి" అని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు తదితరులు హాజరయ్యారు.

## మేడారం కిటకిట



ములుగు/తాడ్వాయి/గోవిందరావుపేట :అమృత్ తెలంగాణ: వనదేవతల మహా జాతర సందడి రోజురోజుకూ పెరుగుతోంది. సమ్మక్క, సారలమ్మ జాతర ఈ నెల 28నుంచి ప్రారంభం కానుండటంతో ముందుగానే భక్తులు మేడారం బాట పడుతున్నారు. ఆదివారం వేలల్లో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకోగా, సోమవారం మేడారం భక్తులతో కిక్కిరిసింది. తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో కుటుంబ సమేతంగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దాంతో మేడారంతో పాటు పరిసరాలన్నీ భక్తజనంతో కిక్కిరిసిపోయాయి.

బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, మేడారం సమ్మక్క భర్త పగిడిద్దరాజును మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల గ్రామం నుంచి మంగళవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామం నందు గద్దె వద్ద బస చేయడానికి తీసుకురానున్నారు. పగిడిద్దరాజు రాక కోసం లక్ష్మీపురంలోని పెనక వంశీయులు, వడ్డెలు, గ్రామ పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. పగిడిద్దరాజు వంశస్థులను సమ్మక్క సారలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మెన్ ఇర్ప సుకన్య సునీల్ దొర, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మెన్ అరెం లచ్చుపటేల్, సమ్మక్క ప్రధాన పూజారి సిద్ధబోయిన స్వామి, పలువురు ఆహ్వానిస్తూ స్వాగతం పలకనున్నారు.

న్యూజిలాండ్ నుంచి మావోరి తెగ ప్రతినిధుల సందర్శన

సోమవారం న్యూజిలాండ్‌కు చెందిన మావోరి తెగ ప్రతినిధులు మేడారాన్ని సందర్శించారు. గద్దెల ప్రాంగణంలో మావోరి తెగ సంప్రదాయ నృత్యం 'హాకా'ను ప్రదర్శించారు. ఇది మావోరి తెగలో యుద్ధానికి సిద్ధమయ్యే సమయంలో తమ సైనికుల్లో ఉత్సాహం నింపేందుకు, శత్రువుల్లో భయాన్ని కలిగించే విధంగా చేసే నృత్యంగా ప్రసిద్ధి చెందింది. తెలంగాణ–న్యూజిలాండ్ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో మావోరి తెగ ప్రతినిధులు మేడారం మహాజాతరను సందర్శించారు. హాకా నృత్య ప్రదర్శన సందర్భంగా మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేశారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని అన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఆదివాసీలు అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని తెలిపారు. వారి జీవన విధానం, విశ్వాసాలు ప్రపంచవ్యాప్తంగా ఒకే తత్వాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. అనంతరం మావోరి తెగ ప్రతినిధులను గద్దల వద్దకు తీసుకెళ్లి వన దేవతల దర్శనం చేయించారు. సమ్మక్క–సారలమ్మ వన దేవతల వైభవం, చరిత్రను మంత్రి సీతక్క వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి మావోరి తెగ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కోయదొరలకు భలే గిరాకీ

జాతర సందర్శకులు కోయ దొరల తాయెత్తులు, వనమూలికలను తీసుకోవడం పలుచోట్ల కనిపించింది. మేడారం జాతర అంటేనే కోయల జాతర కాబట్టి ఇక్కడ కోయ దొరలకు భలే గిరాకీ ఉంటుంది. వారి వనమూలికలపై సందర్శకులకు నమ్మకం ఉన్నందున ప్రతి జాతరలో వారిని నమ్మి సమస్యలు చెప్పి పరిష్కారం కోసం వనమూలికలను తీసుకుంటూ ఉంటారు. కాగా, మేడారం జాతరలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ స్పెషల్ బస్సులను విస్తృతంగా ఏర్పాటు చేసింది. సోమవారం జాతరలోని బస్టాండ్ ప్రాంతంలో సందర్శకులు పెద్దగా లేకపోవడంతో బస్సులు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. తిరుగు ప్రయాణంలో కొద్దిమంది ప్రయాణికులతోనే బస్సులు బయలుదేరుతున్నాయి. ఈనెల 28, 29 తేదీల్లో విస్తృతంగా సందర్శకులు జాతరను సందర్శించే అవకాశాలు ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## రాజ్యాంగం వర్సెస్ రాక్షస పాలన

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన 'ప్రజా పాలన' సాగడం లేదనీ, కేవలం 'రాక్షస పాలన' సాగుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) విద్యార్థులు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాజ్యాంగ ఉల్లంఘనలపై ప్రదర్శించిన లఘు నాటిక అందరినీ ఆలోచింపజేసింది. అనంతరం కేటీఆర్ మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అవలంబిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తుక్కుగూడలో విడుదల చేసిన 'న్యాయ పత్రం'లో పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా మాట్లాడారనీ, కానీ ఆ వేదికపైనే బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన వారు ఆయన పక్కనే కూర్చున్నారని గుర్తు చేశారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో, కాంగ్రెస్ న్యాయ పత్రంలో న్యాయం అంతే ఉందని ఎద్దేవా చేశారు. దాన్ని 'అన్యాయ పత్రం'గా పిలవాలని సూచించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి రేవంత్‌రెడ్డి "బీఆర్ఎస్ జెండా గద్దెలను కూల్చేయండి"అని బహిరంగ సభల్లో పిలుపునివ్వడం శాంతిభద్రతలను, రాజ్యాంగ విలువలను సమాధి చేయడమేనని విమర్శించారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. కోదాడలో దళిత యువకుడు



కర్రా రాజేష్‌ను పోలీస్ కస్టడీలో చిత్రహింసలు పెట్టి చంపారనీ, ఇది జరిగి 60 రోజులు గడిచినా సీఎం రేవంత్‌రెడ్డి కానీ, స్థానిక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కానీ కనీసం స్పందించలేదని అన్నారు.

## బి ఆర్ ఎస్ వై ఆధ్వర్యంలో ఘనంగా గణ తంత్ర వేడుకలు.







మెట్ పల్లి పట్టణంలో ని పాత బస్టాండ్ వద్ద బి ఆర్ ఎస్ వై పట్టణ అధ్యక్షుడు సోమిడి రఘు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బి ఆర్ ఎస్ వై నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు.





మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 26: జనవరి 26వ తేదీ సోమవారం రోజున 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెట్ పల్లి పట్టణం లో సుజిత్ రావు గారి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరణ చేసిన టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు రావు. ఈ సందర్భంగా సుజిత్ రావు మాట్లాడుతూ. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించింది, వారి మేధోకృషితోనే మన రాజ్యాంగం రూపుదిద్దుకుంది ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశంగా భారత దేశం వర్ధిల్లుతుండటం మనందరికి గర్వకారణం అని అన్నారు. రాజ్యాంగ నిర్మాతలను స్మరిస్తూ సుజిత్ రావు గారు ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్,రాష్ట్ర కిసాన్ సెల్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి,టీపీసీసీ ఫిషర్మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ,రాష్ట్ర సేవాదళ్ సెక్రెటరీ అందె మారుతీ, కాంగ్రెస్ పార్టీ మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఖుతుబ్బుదిన్ పాషా,జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కూన రాకేష్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి దొడ్డిపట్ల శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు కోడిమ్యాల దీపక్ రాజ్,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ అమ్ముల పవన్,మల్లాపూర్ మండల

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మల రాజు,ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్, ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ కనుక దినేష్,మాజీ ఎంపిటిసి సిగారపు అశోక్,కల్లెడ గంగాధర్,ఎండి జాఫర్,బైండ్ల శ్రీకాంత్,తోగిటి నాగరాజు,పరశురామ్,పిట్టల వెంకటేష్,ఎట్టెం మల్లేష్, రాకేష్,మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణ తంత్ర వేడుకలు.





మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 26: మెట్ పల్లి పట్టణంలో ని ఇరవయ్ నాలుగవ వార్డు మార్కండేయ విధి లో గల అంగన్వాడీ కేంద్రం లొ గణ తంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ సుజాత జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు వారి తల్లులు.ఏరియా మహిళలు పాల్గొన్నారు.

# కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏట్ హోమ్ కార్యక్రమం

## హాజరైన రాజకీయ నాయకులు జిల్లా అధికారులు .....



‘ఎట్ హోమ్’ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ జిల్లా జనవరి 26 అమృత్ తెలంగాణ నిర్మల్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి ‘ఎట్ హోమ్’ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తమ ఆహ్వానం మేరకు ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అధికారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం, సహోదర భావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్ఞాపికలు అందజేశారు. అతిథులందరికీ శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీవాణి, జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డీఓ రత్నా కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులే వాహనాలపై ప్రెస్ అని రాసుకోవాలి

## ప్రెస్ అని రాసుకోవడం మోటారు వాహన చట్టానికి విరుద్ధమని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని డిపిఆర్ఓ విష్ణువర్ధన్ తెలిపారు....

నిర్మల్ జిల్లా జనవరి 26 అమృత్ తెలంగాణ సమాచార పౌరసంబంధాల శాఖ నుంచి అధికారికంగా అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై ‘ప్రెస్’ (ప్రెస్) అని రాసుకోవాలని లేదా స్టిక్కర్లు వినియోగించాలని జిల్లా పౌరసంబంధాల అధికారి విష్ణువర్ధన్ స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ లేని వ్యక్తులు లేదా ఇతర సంస్థలకు చెందిన వారు వాహనాలపై ఇష్టారీతిన ‘ప్రెస్’ అని రాసుకోవడం మోటారు వాహన చట్టానికి విరుద్ధమని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ అనధికారికంగా ‘ప్రెస్’ స్టిక్కర్లు వినియోగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో ఉన్న సమయంలో సంబంధిత జర్నలిస్టులు ప్రభుత్వం జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డును తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. వాహనాలపై అనధికారికంగా ‘ప్రెస్’ స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్న వారిని గుర్తించేందుకు తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రజలు, సంబంధిత వ్యక్తులు సహకరించాలని ఆయన కోరారు.



డిపిఆర్ఓ విష్ణువర్ధన్

# జిల్లాలో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు

## : జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా











77 వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సోమవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా.

పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, క్యాంపు, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్?లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు ఈ సందర్భంగా దేశభక్తి ఉట్టిపడేలా జరిగిన ఈ వేడుకలకు జిల్లా ప్రజలు, అధికారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. . అనంతరం కలెక్టర్ జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా యంత్రాంగం సాధించిన ప్రగతిని ఆయన తన సందేశంలో వివరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును, సాధించిన విజయాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, సాంస్కృతిక నృత్య రూపకాలు అలరించాయి. కార్యక్రమంలో భాగంగా, జిల్లాలో అంకితభావంతో విధులు నిర్వహించి, విశిష్ట సేవలు అందించిన వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు, ఆరోగ్య పాఠశాల స్టూడెంట్ ఛాంపియన్లకు, ఇతరులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, ఎస్పీ అఖిల్మహాజన్లతోకలిసికలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం స్టాల్ లను సందర్శించి, పలువురు రైతులకు వ్యవసాయ ఉపకరణాలు అందించారు. ఈ వేడుకలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఇతర అధికారులు,ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు.

## జాతీయ జెండాను ఎగురవేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ జిల్లా జనవరి 26 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం, పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, పోలీసు పరేడ్ వాహనంపై పరేడ్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరాలను వెల్లడించారు.ఆ తర్వాత కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పోలీసుల ఉత్తమ సేవలకు గాను పలువురికి మెడల్స్ అందించారు.



నిర్మల్ జిల్లా కేంద్రంలో గల ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఉత్తమ పనితీరుకు ప్రశంసా పత్రాలు కొలమానమని తెలిపారు. రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తూ జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచాలని అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్ళను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిళ, అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు, భైంసా ఎఎస్పీ రాజేష్ మీనా, అదనపు ఎస్పీలు సాయికిరణ్, ఉపేంద్రా రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# బోథ్‌లో జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక సంబరాలు

## పోస్టర్, లోగోను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, ప్రధాన న్యాయమూర్తి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి బోథ్‌లో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ప్రేరణ పోస్టర్, లోగోను సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు కలిసి ఆవిష్కరించారు. సోమవారం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రత్యేక స్పాన్సర్‌షిప్‌తో బోథ్ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలోఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలుఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అన్ని



శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్ పాల్గొన్నారు. ఆర్డీఓ స్రవంతి, జిల్లా పర్యాటకశాఖ అధికారిరవి కుమార్, సంక్షేమ శాఖల అధికారులు మిల్కా, రాజలింగం,సునీత, ఈడి మనోహర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన టౌన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ “ సోమిడి శివకకుమార్,

మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 26; 77 వ ఘన తంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కోరుట్ల నియోజకవర్గం,మెట్ పల్లి పట్టణంలోని 3వ వార్డ్ ఇంద్రనగర్ కాలనీలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన టౌన్ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్” సోమిడి శివ కుమార్’’త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాసరి బాబు, పరుస శ్రీనివాస్, నీరటి అరుణ్ కుమార్, సోమిడి రాజ్ కిరణ్, బత్తుల వెంకటేష్, గోరుమంతుల గణేష్, దాసరి నవీన్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్సీ విద్యార్థులంటే అంత అలుసా..

బాన్సువాడ(నసురుల్లాబాద్) కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బొర్లం ఎస్సీ గురుకుల పాఠశాలలోని విద్యార్థులతో వెట్టిచాకిరి చేయిస్తున్న ప్రిన్సిపల్‌పై కేసు నమోదు చేయాలని విద్యార్థి, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా పాఠశాలకు ఓ ఆటోలో ఫర్నీచర్, కుర్చీలు రావడంతో ఆటోల నుంచి కుర్చీలను విద్యార్థులతో తీయిస్తుండగా డ్రైవర్, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా.. బొర్లం ఎస్సీ గురుకులంలో 8వ తరగతి చదువుతున్న సంగీత అనే విద్యార్థిని ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ఈ ఘటనను నిరసిస్తూ విద్యార్థి, దళిత సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు సోమవారం బాన్సువాడ పట్టణంలో భారీ రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు రవీందర్, తదితర నాయకులు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్‌కు స్థానిక అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో గురుకుల పాఠశాలను విద్యార్థుల నిర్బంధ గృహంగా మార్చేశారని, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయిస్తూ.. అవహేళన చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్లం గురుకుల అంటే విద్యార్థులు భయాందోళనలకు గురవుతూ, విద్యకు ఆటంకం కలిగి, మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని ఆరోపించారు. పాఠశాల ప్రిన్సిపల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో చదువుకునే విద్యార్థులతో తాము మాట్లాడి సమస్యలు తెలుసుకుంటామని గురుకులంలోనికి వెళ్లేందుకు విద్యార్థి సంఘాల నాయకులు ప్రయత్నించగా.. పోలీసులు అనుమతించకపోవడంతో కొంతసేపు వాగ్వివాదం జరిగింది.

విద్యార్థి మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి..

విద్యార్థిని సంగీత మృతిపై బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం బాన్సువాడ పట్టణంలో ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.

# సేంద్రియ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

## నాచురల్స్‌లో చెరకు రసం మిషన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: సేంద్రియ పద్ధతుల ద్వారా ఉత్పత్తి అయ్యే ఉత్పత్తులను జిల్లా ప్రజలు వినియోగించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. పట్టణంలోని నాచురల్స్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన చెరకు రసం మిషన్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 93 మంది రైతుల భాగస్వామ్యంతో నాచురల్స్ నిర్వహించబడటం జిల్లాకే గర్వకారణం అని అన్నారు. ఇక్కడ సేంద్రియ పద్ధతుల్లో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి ప్రాసెసింగ్ చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడే నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతిరోజూ ఇక్కడ అమ్మకాలు కూడా బాగా జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపినట్లు పేర్కొన్నారు. గత జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ చొరవతో నాచురల్స్ ప్రారంభం కావడం అభినందనీయమని తెలిపారు. రైతులు ఇంకా ముందుకు వెళ్లాలని, మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. రైతులకు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. రైతులతోనే సమాజం బలపడుతుందని, వారి అభివృద్ధే సమగ్ర అభివృద్ధికి మార్గమని పేర్కొన్నారు. హార్టికల్చర్ శాఖ ద్వారా స్ప్రింకర్లను అందించామని, భవిష్యత్తులో ఏ సహాయమైన అవసరమైతే అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. నాచురల్స్‌లో నేడు ప్రారంభించిన సేంద్రియ చెరకు రసం ఎంతో ఆరోగ్యకరమైనదని, జిల్లా ప్రజలు తప్పకుండా ఇక్కడికి వచ్చి రుచి చూసి రైతులను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, నాచురల్స్ నిర్వాహకులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

# గణతంత్ర దినోత్సవ పురస్కారాల రాజకీయ , సన్మాన కార్యకలాపాల

మల్లాపూర్ అమృత్ తెలంగాణ జనవరి 26 మల్లాపూర్ మండల కేంద్రంలో 77వ గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి.గ్రామ పంచాయితీలు,పాఠశాలలు,దేశ నాయకుల విగ్రహాల దగ్గర జనగణ మన, వందేమాతరం లాంటి నినాదాలతో దద్దరిల్లిన వేదికలు. ఈవేడుకల మధ్య సర్పంచ్,,ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, విడిసి సభ్యులు స్వీట్లు, బహుమతులు పంచి పెట్టారు .ముఖ్యంగా మల్లాపూర్ మండలంలో మేజర్ గ్రామ పంచాయితీ అయినా మొగిలిపేట గ్రామ ప్రభుత్వ పాఠశాల విషయానికొస్తే , సర్పంచ్ ,ఉప సర్పంచ్ కనీసం జెండా వందన సమయానికి కూడా రాలేకపోవడం నిజంగా బాధపడాల్సిన విషయం . మీరు పాఠశాలకు సరైన సమయంలో ఎందుకు రాలేకపోతున్నారు అని అడిగితే ప్రజలకు ఏంచెప్తారు జాతీయజెండా మీకోసం ఆగదు మీరే సమయానికి రావాలి. మొగిలిపేట ప్రథమ పౌరుడు లేకుండా వీడీసీసభ్యులు వంగ శ్రీనివాస్, మహబూబ్,మాజీ ఎంపీటీసీ దండవేని వెంకటరెడ్డి తో పాటు కొంతమంది మొగిలిపేట యువత, అధ్యాపక బృందంతో పిల్లల తో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ముగించారు.

తర్వాత హాజరైన పాలకవర్గం...

సర్పంచ్ గోల్కొండ కళారమేష్ ,ఉప సర్పంచ్ దండవేణి రాజేందర్,మిగితా వార్డు మెంబర్లు .

అధ్యాపక బృందం తప్ప ఏ ఒక్క నాయకుడు ప్రముఖుల పేర్లు, కనీసం ఈరోజు ప్రాముఖ్యత ఏంటి ( అంబేద్కర్ గురించి) ప్రస్తావించకపోవడం,పిల్లలకు సరైన సందేశం ఇవ్వలేదని యువత నిరుత్సాహపడ్డారు.రాజకీయ నాయకులు ఓటర్లకు తాయిలాలు ప్రకటించినట్టు అదిస్తా ఇదిస్తా అంటూ పిల్లలకు ఇస్తాననడం, అదీ కాకపోతే జెండా ఆవిష్కరణ జరిపిన చోట గొప్ప గొప్ప నాయకుల గురించి మాట్లాడాల్సిన చోట,సన్మానాలు చేయించుకోవడం బాధా కరమని ,వారికి సన్మానాలు చేయడం హర్షించదగ్గ విషయం కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అధ్యాపక బృందం ఆలోచించాలి పిల్లలకోసం అది కావాలి ,ఇది కావాలి అడిగే మీకు నాయకులకు చెప్పాల్సిన బాధ్యత లేదా ఏం మాట్లాడాలో,మీకు తెలియదా సన్మాన కార్యక్రమాలు వేరే చోట జరిపించాలని తెలియదా

ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ కళా రమేష్ పిల్లలకు శుభాకాంక్షలు చెప్తూ,వారు పిల్లలకోసం అడిగినా క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు .ఉప సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల కంటే గురువు గొప్పవాడని ,వారు కష్ట పడ్డ మిమ్మల్ని కష్ట పెట్టిన అది మీ కోసమేనని భావించాలి పదవతరగతి ఫస్ట్,సెకండ్ క్లాస్ లో ఉత్తీర్ణత సాధించిన వారికి మూడువేలు ,రెండు వేలు రూపాయల నగదు బహుమతి ప్రకటించారు .సర్పంచ్ కళా రమేష్ ,ఉప సర్పంచ్ రాజేందర్, కార్యదర్శి గడ్డం సౌజన్య ,విడిసి నుండి మహబూబ్ ,వంగ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్న ఈకార్యక్రమంలో అత్యంత సంతృప్తికర విషయం ఏంటంటే పిల్లల సాంస్కృతిక కార్యక్రమాల ఎపిసోడ్స్ మాత్రమే..




# అందరు చెప్తారు - ఆయన ఆచరిస్తాడు.

# మొగిలిపేట ప్రభుత్వ ఉపాధ్యాయునికి సన్మానం.

మల్లాపూర్ అమృత్ తెలంగాణ జనవరి 26 మల్లాపూర్ మండలం సంగెం శ్రీరామ్ గ్రామానికి గ్రామానికి చెందిన బబ్బూరి రాజేందర్ అనే వ్యక్తి మొగిలిపేట లోని పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా గత కొన్ని సంవత్సరాలుగా పనిచేేస్తున్నారు.అతనికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం తర్వాత సర్పంచ్,ఉపసర్పంచ్ ,వార్డు మెంబర్లు , విడిసి వారు ,ఉపాధ్యాయ బృందం కలిసి శాలువా కప్పి సన్మానించడం గ్రామ ప్రజలే కాదు, అంబేద్కర్ బ్రతికుంటే నిజంగా సంతోషించే వారు. వివారాల్లోకెళితే ప్రభుత్వ బడి గురించి కానీ ,ప్రభుత్వ ఉపాధ్యాయుల గురించి కానీ సమాజంలో చాలా తక్కువ అభిప్రాయం ఉన్న ఈనేపథ్యంలో,తమ ఆర్థిక స్థితి గతులు ఏమాత్రం ఆలోచించకుండా తమ పిల్లల చదువుకోసం ప్రైవేటు పాఠశాలలు ఎంచుకుంటున్న ఈ తరుణంలో ,కొందరైతే ఇంకో అడుగు ముందుకేసి ప్రభుత్వ పాఠశాలలకు మీ పిల్లల్ని పంపించండి అంటూ ,సోషల్ కార్యక్రమాలు చేస్తూ తమ పిల్లల్ని మాత్రం ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్న ఈరోజుల్లో, అందులో ఉపాధ్యాయులు కూడా ఉన్నారన్న ఈ సమయంలో బబ్బూరి రాజేందర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు తమ పిల్లల్ని కూడా తను బోధించే పాఠశాలలో చదివిస్తూ ప్రజలకే కాదు ,తోటి ఉపాధ్యాయులకు కూడా ఆదర్శంగా నిలబడుతూ మాపాఠశాలలో కూడా ప్రైవేటుపాఠశాలలో కంటే మెరుగ్గా బోధిస్తాం అనే మెసేజ్ ఇస్తున్నందుకు మొగిలిపేట గ్రామ పెద్దలు సన్మానించారు. ఈ గణతంత్ర దినోత్సవ సందర్భంగా బబ్బూరి రాజేందర్ మాట్లాడుతూ రాజ్యాంగ విశిష్టత, అది ఎలా రూపుపుదిద్దుకుంది ఎలా అమలు చేయబడుతుంది,దాని కోసం డా.బి ఆర్ అంబేద్కర్ ఏం చేశారనే విషయాల పట్ల చాలా చక్కని అవగాహన పూరితమైన సందేశాన్ని పిల్లలకు అందించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోల్కొండ కళారమేశ్,ఉప సర్పంచ్ దండవేనీ రాజేందర్ ,విడిసి సభ్యులు వంగ శ్రీనివాస్,మహబూబ్ ఖాన్,వార్డు మెంబర్లు,అధ్యాపక బృందం రాజేందర్ కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సన్మానానికి రాజేందర్ అర్హులు అని విద్యా వంతులు కొనియాడుతున్నారు.



# గ్రామాల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

కుభీర్ .అమృత్ తెలంగాణ: మండల కేంద్రమైన కుభీర్ తో పాటు అన్ని గ్రామమలో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. దింతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో స్థానిక సర్పంచులు, వ్యవసాయ సహకార సంఘంలో సిఈఓ క్రాంతి కుమార్ పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ కృష్ణ రెడ్డి తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ శివరాజ్ మార్కెట్ కార్యాలయంలో చెర్మన్ కళ్యాణ్, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలో ప్రాథనోపాద్యులు, గ్రామ గ్రామ కుల సంఘాల్లో జెండా ఎగురావేశారు. అనంతరం ఆయా గ్రామమలో ఉన్న ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశం లో సర్పంచులు ప్రజ ప్రతి నిధులు మాట్లాడుతూ..చదువులతో పాటు క్రీడాలో విద్యార్థులు నైపుణ్యత సాధించేలా చూడలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీ లు ఆయా శాఖలకు చెందిన అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అధికారిగా రిమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శిరాజోద్దీన్..

## ప్రశాంసించిన జిల్లా జడ్జి,జిల్లా కలెక్టర్..

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్ లో నిర్వహించిన వేడుకలలో ఆయా ప్రభుత్వ రంగాలలో పనిచేస్తున్న ఉత్తమ అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు ప్రశంస పత్రాలను అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిమ్స్ ఆసుపత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సిరాజోద్దీన్ సోమవారం 77 వ ఘనతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రశంస పత్రాన్ని అందుకోగా రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్ తోపాటు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే తన సేవలను గుర్తించి ప్రశంస పత్రాన్ని అందించినందుకు జిల్లా కలెక్టర్, జడ్జి డైరెక్టర్,ఎస్పి,రిమ్స్ డైరెక్టర్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# కాంగ్రెస్ పార్టీ లో భారీ చేరికలు

## 1 వార్డు నుండి కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిక

## కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యమని వెల్లడి






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ లో జరిగిన చేరికల కార్య క్రమానికి ఆయన హాజరయ్యారు. 1వ వార్డు జైజవాన్ నగర్ , మహాలక్ష్మి వాడ నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ లో చేరారు. వారందరికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. మున్సిపల్ ఎన్నికల ముంగిట పార్టీలోకి చేరికలు జరగడం మంచి పరిణామమన్నారు. ఇంత మంది చేరికతో పార్టీ కి వెయ్యి ఏనుగుల బలమిచ్చిందన్నారు. 40 వార్డుల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో ప్రతిపక్షాలకు తెలియచేయాలన్నారు.ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో దాదాపు 60శాతానికి పైగా స్థానాలు గెలుచుకున్నామని అదే ఊపుతో రెట్టించిన ఉత్సాహంతో మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పని చేద్దామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరెంట్, 500 లకు గ్యాస్ సిలిండర్ ,రేషన్ కార్డులు, సన్నబియ్యం లాంటివెన్నో అందిస్తుందన్నారు. మరొక శుభవార్త అంటూ ప్రతీ మహిళకు నెలకు 2500 రూపాయల పథకం త్వరలో రాబోతుందన్నారు. సీయం రేవంత్ రెడ్డి దీనిని త్వరలో ప్రారంభించబోతున్నారంటూ చెప్పారు.అందుకే ఎన్నో మంచి పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు,మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి.. మువ్వన్నెల జాతీయ జెండాకు వందనం సమర్పించి రాజ్యాంగ రూపకర్తలు అంజలి ఘటించిన బోరంచు



మావల రైతు వేదిక వద్ద త్రివర్ణ జెండాకు నమస్కరిస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అదిలాబాద్ జిల్లా డిసిసి పార్టీ ఆఫీసులో గణతంత్ర దినోత్సవ ఉత్సవాల్లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



గణతంత్ర వేడుకల్లో రెడ్డి సంఘ భవనంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డి మరియు రెడ్డి సంఘం నాయకులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర్య వేడుకల్లో డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొని స్వాతంత్ర్య సమరయోధులకు, రాజ్యాంగ రూపకర్తలు అంజలి ఘటించి జాతీయ జెండాకు వందనం సమర్పించారు. అటు మావల గ్రామపంచాయితీ కార్యాలయంలో, మావల ఎంపిడివో కార్యాలయంలో, రైతువేదికలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొనడం జరిగింది. అనంతరం జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర్య వేడుకల్లో పాల్గొని మువ్వన్నెల జెండాకు వందనం సమర్పించారు. అటు బొక్కల గూడ, బంగారుగూడ కాలనీల్లో ఏర్పాటుచేసిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవం వేడుకలు..

ముధోల్ :అమృత్ తెలంగాణ: నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ తోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముధోల్ లో తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లవకుమార్, మండల విద్యా వనరుల కార్యాలయంలో విద్యాధికారి రమణ రెడ్డి ,పోలీస్ స్టేషన్ లో సీఐ రవీందర్ నాయక్, వ్యవసాయ పరిశోధన స్థానం లో శాస్త్ర వేత్త డా.దినేష్,ఎడిఏకార్యాలయంలో ఏడీఏ శ్రీనివాస్ రాజు, ఐకెపి కార్యాలయంలో అధ్యక్షురాలు జయాశీల ముధోల్ గ్రామ పంచాయతీ లో సర్పంచ్ శబనా బేగం, ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ సరోజని,ఆశ్రమ పాఠశాల లో ప్రదానోపాధ్యాయు లు సూర్యదాస్, ప్రెస్ క్లబ్ లో అధ్యక్షుడు షఫీ ఉల్లాఖాన్, జెండా ను ఎగరవేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డా.అనిల్ ,ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కనకమహాలక్ష్మి, ఆయా ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, గ్రామపంచాయతీలలో సర్పంచ్ లుత్రివర్ణ పథకాన్ని ఎగురవేశారు. రభింద్రా, అక్షర, శ్రీవిద్యా, భాష్యం, సంకల్పం పాఠశాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వాడవాడలో త్రివర్ణ పథకం రెపరేపలాండింది. పాఠశాలల్లో విద్యార్థులు కు నిర్వహించిన ఆటల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

## ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిన గొప్ప పత్రం భారత రాజ్యాంగం

**టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస రావు**
**జిల్లా కార్యాలయంలో ఘనంగా గణ తంత్ర దినోత్సవ వేడుకలు**



జగిత్యాల అమృత్ తెలంగాణ జనవరి 26: ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిన గొప్ప పత్రం భారత రాజ్యాంగం అని టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాస రావు అన్నారు. 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో గల టియూడబ్ల్యూజే ఐజేయు జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి, స్వీట్లు పంపిణీ చేసి గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మనం 1947 ఆగస్టు 15న బ్రిటీష్ పాలన నుండి స్వాతంత్ర్యం పొందినప్పటికీ, మనకంటూ ఒక సొంత చట్టం, ఒక రాజ్యాంగం ఏర్పడింది మాత్రం 1950 జనవరి 26న అన్నారు. ఆ రోజునే మన దేశం పూర్తిస్థాయి గణతంత్ర రాజ్యంగా అవతరించిందని తెలిపారు. అందుకే ప్రతి ఏటా ఈ రోజును మనం ఎంతో గర్వంగా జరుపుకుంటాం అని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాత్రికేయులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జెంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి, ఆదిల్, జిల్లా ఉపాధ్యక్షులు హైదర్ అలీ, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శులు గుర్రం చంద్ర శేఖర్, చింత నరేష్, కార్యవర్గ సభ్యులు మనోజ్, నరేష్, శ్రీకాంత్, తాండ్ర శంకర్ గౌడ్, జగిత్యాల పట్టణ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎల్లాల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర్, ఉపాధ్యక్షులు ముసిపట్ల దేవేందర్, బద్దెనపల్లి మల్లేశం, శనిగరపు శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు వేణుగోపాల్, అంజయ్య, స్వామి, లక్ష్మారెడ్డి, ఆనంద్, పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఇంద్రసేన ఆధ్వర్యంలో జెండా పండుగ.




మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 26: మెట్ పల్లి పట్టణంలో ని ఇంద్రసేన ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఇంద్ర సేన అధ్యక్షుడు అమ్ముల ప్రవీణ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఈ రోజు మన దేశం గర్వించదగ్గ రోజు అని ప్రతి భారతీయుడు దేశం కోసం పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రసేన సభ్యులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం టీయూడబ్ల్యూజే(ఐజేయు) అధ్యక్ష కార్యదర్శులు బూరం సంజీవ్, మమ్మద్ అజీమ్.





మెట్ పల్లి అమృత్ తెలంగాణ జనవరి 26: భారత రాజ్యాంగం గొప్పది అని ప్రతీ పౌరుడు రాజ్యాంగాన్ని గౌరవించాలి అనిటీయూడబ్ల్యూజే(ఐజేయు) అధ్యక్ష కార్యదర్శులు బూరం సంజీవ్, మమ్మద్ అజీమ్ లు అన్నారు. 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా టి యు డబ్ల్యు జే (ఐజేయూ) మెట్ పల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షులు బూరం సంజీవ్ జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం అధ్యక్షులు బూరం సంజీవ్, మమ్మద్ అజీమ్ లు మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం ని గౌరవించాలని, దేశానికి సేవ చెయ్యాలని అన్నారు. భారత దేశం ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని కలిగివుంది అని అన్నారు. భారతదేశానికి అతిపెద్ద భారత రాజ్యాంగం అందించడానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎంతగానో కృషి చేశారని వారిని గుర్తు చేసుకున్నారు. 1956జనవరి 26 న మన రాజ్యాంగం అమలులోకి గొప్ప వ్యక్తుల కృషి వల్ల మనకు స్వేచ్ఛ, సమానత్వం,హక్కులబించాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో

గౌరవ అధ్యక్షుడు మాసుల ప్రవీణ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, గౌరవ సలహాదారులు దాసం కిషన్ ,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ , బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ ఏసమేని గణేష్, ఎండి అభిద్, సఫీ, , అమ్ముల ప్రవీణ్ ,శశికుమార్ అన్నపుల్ల శ్రీనివాస్ గౌడ్ ,చెట్ పల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు..

బజార్ హాత్నూర్ : అమృత్ తెలంగాణ:భారత రిపబ్లిక్? దినోత్సవం సందర్భంగా మండల పరిధి 31 గ్రామాల్లో వాడవాడల్లో పాఠశాలలో, కళాశాలలో, సచివాలయాలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు వద్ద ఆయా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక గ్రామపంచాయతిలో సర్పంచ్ పరచ సాయన్న, ప్రాథమిక సహకార సంఘంలో సిఈఓ నారాయణ గౌడ్, పశు వైద్యశాలలో డాక్టర్ పార్విద్ హైమద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ భీమ్ రావు, వ్యవసాయ కార్యాలయంలో ఏవో మొహమ్మద్ సౌద్, మండల పరిషత్? కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శ్యాంసుందర్ లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశస్వాతంత్రం కోసం మహాత్మ గాంధీ ఆధ్వర్యంలో అహింసా మార్గంలో పయనించి ఈ దేశానికి స్వాతంత్రం తీసుకొని రావడం జరిగిందని కొనియాడారు. ఈ స్వాతంత్రం ఉద్యమంలో మహనీయులతోపాటు అనేక లక్షల మంది ప్రజల త్యాగం ఉన్నదన్నారు.

## బొద్దింకలతో నిండిన గదిలో జాన్వీ బంధిఖానా



బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో క్షణం తీరిక లేకుండా ఉంది జాన్వీ కపూర్. ఈ యంగ్ బ్యూటీ నటించిన మిలీ ఎట్టకేలకు నవంబర్ 4న పెద్ద తెరపైకి వచ్చింది. పాజిటివ్ సమీక్షలతో మిలీ బాక్సాఫీస్ వద్ద బాగానే రాణించిందని ట్రేడ్ వెల్లడించింది. మత్తుకుట్టి జేవియర్ దర్శకత్వం వహించిన ఈ సర్వైవల్-థ్రిల్లర్ లో సన్నీ కౌశల్ - మనోజ్ పహ్వా కూడా ప్రధాన పాత్రలు పోషించారు. ఇది మలయాళ భాషా చిత్రం హెలెన్ కి రీమేక్. ఈ సినిమాని జాన్వీ తండ్రి బోనీకపూర్ స్వయంగా నిర్మించడం ఆసక్తికరం. పాపా బోనీ నిర్మాతగా మొదటి సహకారం జాన్వీకి చాలా ప్రత్యేకమైనది. తన స్పెషల్ సర్వైవల్ డ్రామాను ప్రచారం చేస్తూ తాజాగా జాన్వీ చెప్పిన ఓ సంగతి యువతరంలో హాట్ టాపిగ్గా మారింది. తాను బొద్దింకలతో నిండిన గదిలో ఎందుకు బంధించబడాలనుకుంటోందో జాన్వీ ఈ ఇంటర్వ్యూలో వివరించింది. ఒకవేళ బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితే లేదా మిలీ సినిమాలో లాగా ఫ్రీజర్ లో బంధించబడితే..? ఈ రెండిటిలో ఏది బెస్ట్.. మీరైతే ఏం చేస్తారు? మీ ఫీలింగ్ ఏంటీ? అంటూ హోస్ట్ జాన్వీ కపూర్ ని సరదాగా ప్రశ్నించారు. దానికి జాన్వీ ఆసక్తికర సమాధానం ఇచ్చింది. నేను ఫ్రీజర్ లోకి తిరిగి వెళ్లలేను. నేను బొద్దింకలతో నిండిన గదిలో బంధించబడితేనే బెటర్ అని చెప్పింది. ఫ్రీజర్లో ఉ ండటం చాలా కష్టంగా ఉందని కూడా జాన్వీ తెలిపింది. జాన్వీ కపూర్ మిలీ కథాంశం ఆసక్తికరం. ఒక ప్రముఖ ఫాస్ట్ ఫుడ్ ఫ్రాంచైజీలో వెయిటర్ గా పనిచేసి 48 గంటలకు పైగా ఫ్రీజర్ లో బంధించబడిన ఒక అమ్మాయి కథేమిటన్నది తెరపై చూపించారు.

## మరోసారి బోల్డ్ గా ఒంపుల్ని ప్రదర్శించిన ఇషా

టాప్ మోడల్ కం నటి ఇషా గుప్తా పరిచయం అవసరం లేదు. గ్లామర్ షో విషయంలో హద్దులు చెరిపేసి చెలరేగడం ఈ సీనియర్ బ్యూటీ ప్రత్యేకత. ఇన్ స్టా వేదికగా ఇషాగుప్తా ఎప్పటికప్పుడు చెలరేగి అందాలు ఆరబోస్తుంది. తాజాగా ఇషా షేర్ చేసిన బోల్డ్ ఫోటోషూట్ అంతర్జాలంలో దుమారం రేపుతోంది. ఇషాజీ మరోసారి తనదైన శైలిలో చెలరేగారు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్ గౌలో వజ్రంలా మెరుస్తోంది. ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రాప్డ్ స్లీవ్ లో గ్లామర్ ని ఆవిష్కరించిన తీరు కుర్రకారుకు మైండ్ బ్లాక్ చేస్తోంది. మోడల్ కం నటి పర్యావరణవేత్త అయిన ఈషా గుప్తా నటిగా ఇప్పటికే బాలీవుడ్ లో తనదైన ముద్ర వేసింది. తిరుగులేని ఎనర్జీతో స్టైల్ ఐకాన్ గా వెలుగులు విరజిమ్ముతోంది. తన స్టైల్ పై రెగ్యులర్ అప్ డేట్ లతో ఈషా ఇప్పటికే 13 మిలియన్లకు పైగా ఇన్ స్టాగ్రామ్ ఫాలోవర్ల ఫాలోవర్ లను సంపాదించింది. ఈషా గుప్తా నిరంతర ఫ్యాషన్ సెన్స్ పై నేటితరంలో డిబేట్లు సాగుతుంటాయంటే అర్థం చేసుకోవాలి. తాను ఎంచుకున్నది ఎత్నిక్ వేర్ అయినా... ఆరు గజాల పవిట కొంగుతో చీరలో అయినా.. అందమైన గౌనులో అయినా తన డ్రెస్సింగ్ సెన్స్ నుంచి కళు తిప్పుకోవడం అంత ఈజీ కాదు. ఈషా గుప్తా జెన్నీ ప్యాక్ మన్ ప్లాటినం గ్రే సీక్విన్ గౌలో ఒంపులు రంగరించిన తీరుపై చర్చా సాగుతోంది. ఇషాజీ ఫ్యాషన్ ప్రపంచపు మహారాణి. రక రకాల ఫ్యాషన్ దుస్తులకు స్టైలింగ్ చేస్తూ మోడల్ గా అదరగొడుతుంటుంది. తన ఇన్ స్టాగ్రామ్ ఫోటోలలో ప్రయోగాలతో పాటు కాలానుగుణ వస్త్రధారణలతో తన ఆసక్తిని తరచుగా ప్రదర్శిస్తుంది. తళతళా




మెరిసే దుస్తులతో ప్రతిసారీ డ్రీమ్ గాళ్ ని తలపిస్తుంది. మెరిసే గౌనులో ఈషా మరోసారి కళ్ళు తిప్పుకోనివ్వని ట్రీటిచ్చింది. ఈసారి జెన్నీ ప్యాక్ మన్ రాక్ ల నుండి ప్లాటినం గ్రే గౌనును ఎంచుకుంది. ఆమె ఫ్లోర్-లాంగ్ గౌనులో త్రీక్వార్టర్ లెంగ్త్ డ్రెప్డ్ స్లీవ్ తో ఆకట్టుకుంది. స్ట్రెయిట్ హెయిర్ నిగనిగల అందాలతో మెరిపించింది ఇషా. ఇషా గుప్తా టాలీవుడ్ కి సుపరిచితం. కానీ ఇక్కడ నటించేందుకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదు. రామ్ చరణ్ వినయ విధేయ రామాలో హాట్ ఐటమ్ నంబర్ తో కట్టి పడేసినా ఆ తర్వాత కనిపించలేదు. 'జన్నత్' సినిమాతో బాలీవుడ్ లో లాంచ్ అయింది. ఆ తర్వాత అక్కడ బాగానే అవకాశాలు వస్తున్నాయి. కాలేజ్ డేస్ నుంచి సినిమాలంటే ఆసక్తి. దీంతో ఈషా మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఎన్నో అందాల పోటీల్లో పాల్గొంది. ఫెమినా మిస్ ఇండియా పోటీల్లోనూ నెగ్గింది. చివరిగా బాలీవుడ్ లో నటిగా స్థిరపడింది. ప్రస్తుతం ప్రపంచ సుందరి పోటీలకు ఎంపికయ్యే మోడల్స్ కి ఇషా జీ శిక్షణను అందిస్తున్నారు. ఫెమీనా మిస్ ఇండియా జడ్జిగానూ ఇషా కు చాలా అనుభవం ఉంది. ఇటీవల బాబీ డియోల్ తో కలిసి 'ఆశ్రమ్ సీజన్ 2'లో ఈషా చివరిగా కనిపించింది. పలు భారీ చిత్రాలకు ఇషా గుప్తా సంతకాలు చేసింది. వాటి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## మల్లె చెండు ఒళ్లంతా చుట్టుకుని కలకలం రేపిన నటి

అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. కొత్తొక వింత పాతొక రోత! పాత సంవత్సరానికి భాయ్ చెప్పి కొత్త సంవత్సరానికి వెల్ కం చెప్పింది కన్నడ నటి రాగిణి ద్వివేది. ఉగాది ఫర్వదినాన్ని పురస్కరించుకుని ఇదిగో ఇలా కొత్తగా కొంగొత్తగా తనని తాను పరిచయం చేసుకుంది. గతాన్ని తలుచుకుని సమయాన్ని వృధా చేసేందుకు రాగిణి సిద్ధంగా లేదు. భవిష్యత్ గురించి మాత్రమే ఆలోచిస్తోంది. అందుకే రాగిణి ద్వివేది ఉగాది స్పెషల్ ఫోటోషూట్ తో అభిమానుల ముందుకు వచ్చింది. ఇదిగో ఇలా మల్లె చెండును ఒంటికి చుట్టుకుని, జెరీ అంచు బంగారు వర్ణం సిల్కు చీరలో దేవతా సుందరిలా మెరిసిపోతోంది. అలా పానుపుపై జేరబడి, మల్లెలను ముంజేతికి కట్టుకుని సువాసన పీలుస్తూ, అసలు రాగిణి ఇచ్చిన ఫోజ్‌లు కుర్రకారులో కలకలం రేపుతున్నాయి. పానుపుపై బంతిపూల దండల మధ్య రాగిణి రసరమ్యంగా మెరిసిపోతోంది. ఒక కొత్త సంవత్సరం, ఒక కొత్త అధ్యాయం - దానిని ఆశ - దృఢ సంకల్పంతో స్వీకరించండి! ప్రతి సూర్యోదయం ఒక కొత్త అవకాశాన్ని తెస్తుంది - దీనిని అద్భుత ప్రారంభంగా చేసుకోండి!

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## మళయాళ భామ 'కుమారి'గా వస్తుంది..!



మళయాళంలో తన నటతో మెప్పిస్తూ వస్తున్న ఐశ్వర్య లక్ష్మి ఈమధ్య తమిళ సినిమాల్లో కూడా సందడి చేస్తుంది. తెలుగులో గాడ్సే సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఐశ్వర్య లక్ష్మి. రీసెంట్ గా పొన్నియిన్ సెల్వన్ 1 సినిమాతో కూడా అమ్మడు ఆకట్టుకుంది. సినిమాలో తన పోర్షన్ వరకు అదరగొట్టేసింది ఐశ్వర్య. సినిమాలే కాదు ఓటీటీ వెబ్ సిరీస్ లతో కూడా ఆడియన్స్ ని అలరిస్తుంది అమ్మడు. ఇటీవలే అమ్ము అంటూ ఓ తెలుగు వెబ్ సిరీస్ తో వచ్చిన ఐశ్వర్య లక్ష్మి ఆ సినిమాతో ప్రశంసలు అందుకుంది. ఆ మూవీ తర్వాత కొద్దిపాటి గ్యాప్ తోనే మరో మూవీతో వస్తుంది ఐశ్వర్య. ఈసారి కుమారి అంటూ ఒక మైథలాజికల్ ఫాంటసీ మూవీతో వస్తుంది. ఈ మూవీని నిర్మల్ సహదేవ్ డైరెక్ట్ చేశారు. నెట్ ఫ్లిక్స్ లో ఈ సినిమా నవంబర్ 18 శుక్రవారం రిలీజ్ అవుతుంది. అమ్ము సినిమాతో ఒక ఇంప్యాక్ట్ క్రియేట్ చేసిన ఐశ్వర్య లక్ష్మి కుమారితో కూడా అలరిస్తుందని అంటున్నారు. ఇప్పటికే నెట్ ఫ్లిక్స్ లో వస్తున్న కుమారి మూవీ టీజర్ ట్రైలర్ ఈ సిరీస్ పై ఆసక్తి కలిగించాయి. థియేటర్ లోనే వస్తేనే కాదు తమకు నచ్చిన కంటెంట్ ఎక్కడ రిలీజైనా సరే చూసేస్తున్నారు ప్రేక్షకులు. ముఖ్యంగా సినిమా టికెట్ల రేట్లు పెరగడం.. అంత ఖర్చు పెట్టి సినిమా చూసినా నిరాశపరచడం లాంటి కారణాల వల్ల థియేటర్ లో సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపట్లేదు. అందుకే ఓటీటీలకు ఎక్కువ డిమాండ్ పెరిగింది. భాషతో సంబంధం లేకుండా ఓటీటీ లో వెరైటీ కంటెంట్ ఉంటే చాలు ప్రేక్షకులు విరగబడి చూసేస్తున్నారు. వెండితెర మీద అద్భుతాలు చేయాలని అనుకున్న ఔత్సాహిక కళాకారులకు కూడా ఈ ఓటీటీల్లో మంచి అవకాశాలు వస్తున్నాయి. అందుకే ఈమధ్య ఓటీటీల్లో మంచి మంచి కంటెంట్ సినిమాలు వస్తున్నాయి. తెలుగులోనే కాదు ఇతర భాషల సినిమాలు వెబ్ సిరీస్ లు కూడా మన ప్రేక్షకులు చూస్తున్నారు.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com